క్లుప్తంగా

విగ్రహ ఏర్పాటుకు విరాళం



నారాయణపేట రూరల్: మండలంలోని పేరపళ్ల గ్రామ శివారులోని మల్లయ్యస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన భద్రాద్రి రామయ్య ఫౌండేషన్ సభ్యులు పిల్లికండ్ల జయశ్రీ, వెంకట్రాములు దంపతులు రూ. 21,116 చెక్కు ఆలయ కమిటీ నిర్వాహకులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, సాయన్న, కృష్ణవాసు, రాములు,ఆశప్ప, సాయిలు, మొగులప్ప, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



కోస్గి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం రాత్రి మండల పరిధిలోని కొమ్మూర్–గుండుమాల్ గ్రామ శివారులో ఇసుక నింపుకొని కోస్గికి తరలిస్తుండగా భక్తిమళ్ల గ్రామ శివారులో టిప్పర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ యజమానులు శ్రీనివాస్, వెంకట్‌చారి, డ్రైవర్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.

ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ఎంపికపై హర్షం

కోయిల్‌కొండ: దేశ రాజధాని ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తాను ఎంపిక చేయడంతో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అశోక్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్యవైశ్య నుంచి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వడంపై దేశ ప్రధాని నరేంద్రమోదీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు వెంకటేష్, మందిపల్లిరాజు, శ్రీనివాస్, రాము, సతీష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ



వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పక్కన ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి చోరీ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి మున్సిపాలిటీ పక్కన ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయానికి పూజారి శ్రీహరి తాళం వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వచ్చి చూసే సరికి గేట్లు తెరుచుకొని ఉండటం గమనించిన పూజారి ఆలయ చైర్మన్ రామచంద్రారెడ్డికి ఫోన్ చేసి చెప్పడంతో.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు క్లూస్‌టీం తో ఆధారాలు సేకరించారు. హుండీలో ఉన్న సుమారు రూ.20 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పూజారి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్రీడలు ఆరోగ్య సాధనాలు

కొత్తకోట: ప్రస్తుతం యువత క్రీడలను ఆరోగ్య సాధనాలుగా మార్చుకోవాలని కొత్తకోట ఎస్‌ఐ ఆనంద్ అన్నారు. గురువారం పట్టణంలో కొత్తకోట ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో ఏడో రోజు నిర్వహించిన సెమీఫైనల్ క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తినే ఆహారం చాలా వరకు కలుషితం కావడం వల్ల యువత అనారోగ్యాలకు గురవతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు యువత ఏదో ఒక క్రీడను అలవాటు చేసుకొని నిత్యం వాటిని ఆరోగ్య సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరం కావడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు నవీన్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, గుంత శివ, రఘు, కార్తీక్, సాయి, సన్ని, మహేష్, శివశంకర్, తరుణ్, గణేష్, అరుణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ అభివృద్ధికి అడుగులు



ఆర్డీఓ కార్యాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుతో నియోజకవర్గ ప్రాంత అభివృద్ధికి అడుగులు పడుతాయని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి అన్నారు. నారాయణపేట ఆర్డీఓ నూతన కార్యాలయ భవన సముదాయాన్ని రూ.7.50 కోట్లతో నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్ర సమీపంలోని లోకాయపల్లి లక్ష్మమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ నిర్మాణం చేపట్టే 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. యాద్గీర్ రోడ్‌లోని ఆర్డీఓ కార్యాలయాన్ని నెల రోజుల్లో షిఫ్ట్ చేయాలని ఆర్డీఓ మేఘా గాంధీకి ఎమ్మెల్యే సూచించారు. నెల రోజుల్లో ట్రాక్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీపంలోని బైరంకొండ శివారు వరకు ప్రభుత్వ భూములు దాదాపు 92 ఎకరాల వరకు ఉంటాయని ఎక్లాస్‌పూర్ వాసులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. గతంలో 50 ఎకరాలు సైనిక్ స్కూల్ కోసం ప్రతిపాదనలు పంపించారని, రెండు ఎకరాలు ఎక్సైజ్ కార్యాలయానికి భూమి కేటాయించేందుకు గ్రామ పంచాయతీలో తీర్మానం చేసినట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని గ్రామస్తులను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఆర్.శివారెడ్డి, ఆర్డీఏ జిల్లా మెంబర్ పోషల్ రాజేష్‌కుమార్, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంతకుమార్, కాంగ్రెస్ నాయకులు రవికుమార్ చారి, రాజురెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపార్ ఐడీల నమోదు పూర్తి చేయాలి



అపార్ ఐడీపై సూచనలు చేస్తున్న ఎంఈఓ రామకృష్ణ

నర్వ: అపార్ ఐడీల నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. గురువారం రాంపూర్ యూపీఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అపార్ ఐడీ వివరాల నమోదుపై హెచ్‌ఎంను ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంద శాతం విద్యార్థుల హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉస్మాన్ ఖాదర్, ఉపాధ్యాయురాలు మాధవి, ఐఈఆర్పీ రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



కోస్గి రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా క్రీడల్లో రాణించాలని సూచించారు. మండల పరిధిలోని బోలోనిపల్లి గ్రామంలో శివాజీ జయంతి సందర్భంగా కబడ్డీ పోటీలను రెండు రోజులుగా నిర్వహించారు. గురువారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగులపల నరేందర్, మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్, నరేష్, చెన్నరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న వెంకటేష్



పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగు

నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని మండిపడ్డారు. ఆహారం విషయంలో నాణ్యత పాటించడం లేదన్నారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు గౌస్, నాయకులు మహిపాల్, సురేష్, సాగర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి



కొత్తపల్లి: అల్లీపూర్ గ్రామానికి చెందిన ఎల్లప్పను చిత్రహింసలకు గురిచేసిన మద్దూరు పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం బృందం బాధితుడు ఎల్లప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. నడవలేని స్థితిలో ఉన్న ఎల్లప్పకు వైద్య సహాయం అందించాలని, వెంటనే మూడు నెలల స్కావెంజర్ వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ఎల్లప్పకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గోపాల్, బలరాం , అంజియల్యగౌడ్, అశోక్, అరుణ్‌కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కురుమయ్య

నారాయణపేట రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా నాడు పీసీసీ అధ్యక్ష హోదాలో నేటి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బీసీ జాగృతి సేన నియోజకవర్గ అధ్యక్షుడు ఎడ్ల కురుమయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీటీఎం క్లబ్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని కోటకొండ, గార్లపాడు, కాన్ కుర్తి గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బడ్జెట్ కేటాయించి ప్రాజెక్టు పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని కోరారు. జీఓ 69 అమలుకు ఎలాంటి ఆటంకం లేకుండా రైతుల సమ్మతంతో డీపీఆర్ ప్రకారం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆంజనేయులు, కనకప్ప, నాని పాల్గొన్నారు.

కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాము

కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి రాము డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా గత పాలకులు నిర్లక్ష్యం, చేసి స్వార్థ ప్రయోజనాలకు కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించలేదన్నారు. పాదయాత్ర, రిలే నిరాహార దీక్షలు చేపట్టి ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం పర్యటనలో కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జీఓ 69 అమలుపై సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయ, నరసింహ, రాములు, నారాయణ, సాయిలు, భీమేష్, రాము, అశోక్ పాల్గొన్నారు.

మహిళా కేసరి విజేతగా నాగలక్ష్మి



ధన్వాడ: మండలంలోని మంది పల్లితండాకు చెందిన నాగలక్ష్మి అనే విద్యార్థిని ఈనెల 16 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో జరిగిన ఛత్రపతి శివాజీ మహిళా కేసరి(రెజ్లింగ్) విజేతగా గెలుపొందింది. ఈ సందర్భంగా ఆమెకు సైకిల్ రూ.5000 విలువైన పట్టు చీరను అందజేసినట్లు కోచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నారాయణపేట రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రెటరీ ఊసు రవికుమార్, డీవైఎస్ఓ వెంకటేష్‌శెట్టి అభినందనలు తెలిపారు.

ఎట్టకేలకు బీటీ రోడ్డుకు మరమ్మతు



రోడ్డుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

దామరగిద్ద: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం మధ్యలో రహదారిపై ఏర్పడిన గుంతలకు గురువారం మరమ్మతు చేపట్టారు. త్వరలో ప్రస్తుతం ఉన్న ఏడు మీటర్ల రహదారిని 10 మీటర్ల రహదారి ఏర్పాటుకు పనులు మొదలవనున్న నేపథ్యంలో మరమ్మతు చేపట్టినట్లు సబ్‌కాంట్రాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

22న కోడెదూడల వేలం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ దేవస్థానానికి భక్తులు మొక్కుల కింద ఇచ్చిన కోడెదూడల వేలం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్, ఆలయ ఈఓ శ్రీనివాసరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుందని, కేవలం రైతులు మాత్రమే పాల్గొనాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన అబ్దుల్ రహిమాన్ ఉర్సు



చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం అప్పంపల్లిలో మూడు రోజుల పాటు అబ్దుల్ రహిమాన్ (మాసన్న) ఉర్సు అంగరంగ వైభవంగా కొనసాగింది. గురువారం దర్గాలో స్వామివా రికి దివ్యఖురాన్ ఫాతేహాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల పీఠాధిపతులు హాజరై స్వామి వారికి పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక పార్థన చేశారు. కార్యక్రమానికి అజ్మీర్ ఖాజా నవాజ్ దర్గా షరీఫ్ వ జీర్ హుస్సేన్, తాండూర్ దర్గా పీఠాధిపతులు సాబేర్ పాషా, అజీజ్‌పాషా, దుప్పల్లి దర్గా పీఠాధిపతులు కరుణాకర్‌గౌడ్, రోషన్‌గౌడ్, రవికుమార్‌గౌడ్, దర్గా నిర్వహకులు శంకర్, సుదర్శన్, కమలాకర్, భగవాన్ పాల్గొన్నారు.

పీయూకు మంచి పేరు తీసుకురావాలి

మహబూబ్ నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలోని పలు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్ హ్యాండ్‌బాల్ ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీయూ రిజిస్ట్రార్ చెన్నప్ప హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, సత్యభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సూర్యమోహన్‌రెడ్డి

మరికల్: జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం పేటలో జరిగే సభలో ముఖ్యమంత్రి వెయ్యి కోట్లకు సంబంధించిన అభివృద్ధి పథకాల ప్రారంభం, శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. మరికల్ మండలం నుంచి వెయ్యి బైక్‌లు, 500 జీపులతో 3 వేల మందిని సమీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హరీష్, గోవర్ధన్, సత్యన్న, శ్రీను, రామకృష్ణరెడ్డి, సత్యనారాయణ, రఘు, కుర్మన్న, జాకీర్, మొగులప్ప, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మద్దూరు/కొత్తపల్లి: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. అల్లీపూర్‌లోని ఎల్లప్పపై జరిగిన దాడి సంఘటనపై గురువారం కొత్తపల్లి మండల కేంద్రంలో విలేకర్లకు వివరించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చెన్నప్ప, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఎల్లప్ప వ్యవహారం పోలీసులకు సంబంధించిందని ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే కుల సంఘాలను రెచ్చగొట్టి బుదరచల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో పట్నం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దౌల్తాబాద్ మండలంలోని యాదవుడి, పోల్లేపల్లి కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులతో దాడులు చేయించిన విషయం నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. ఇలాంటి చౌకబారు చర్యలకు పాల్పడి నియోజకవర్గ అభివృద్ధికి నిరోధకులగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు పాల్పడుతున్నారి ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఊట్కూరు: సమాజంలో బాల్య వివాహాలు అరికట్టేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని డీసీపీయూ జిల్లా అధికారి తిరుతపయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు యుక్త వయసు వచ్చే వరకు వివాహం చేయకూడదన్నారు. బాల్య వివాహం ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలుంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీసు ద్వారా మరిన్ని పథకాలు తీసుకొచ్చిందని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓఎంఐఎఫ్ కోఆర్డినేటర్ ఆజమ్మ, ఎస్‌ఐ కృష్ణంరాజు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉదిత్‌రాజ్‌ను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న వెంకటేష్

ధన్వాడ: బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు ఉదిత్‌రాజ్‌ను వెంటనే కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఎలిగండ్ల వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే ఉదిత్‌రాజ్‌ను సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ గుర్రంరాజు, మైనార్టీ కన్వీనర్ మహిముద్, మండల నాయకులు కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నర్సింహులు

నారాయణపేట రూరల్: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, రాము డిమాండ్ చేశారు. గురువారం జాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచి వారిని ఆదుకోవాలని కోరారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 11వ పీఆర్సీ అమలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటయ్య, మహాదేవ్, బాలప్ప, చెన్నయ్య, రాములు, రవి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి నోచుకోని అమరచింత

- మున్సిపాలిటీగా మారినా తెరుచుకోని వైనం



నిరుపయోగంగా గంథ్రాలయ భవనం

అమరచింత: పట్టణంలో కొన్నేళ్లుగా గ్రంథాలయం మూతపడి ఉన్నా మున్సిపల్ అధికారులు, పాలక మండలి పట్టించుకోవడం లేదు. పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని గదిని కేటాయించినా నిర్వహణ భారంతో మూతపడింది. కనీసం దినపత్రికలు చదవాలనుకున్న వయోజనులు మూతపడిన గ్రంథాలయం ఎన్నడు తెరుస్తారో అని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అమరచింత గ్రామంగా ఉన్నప్పుడు కొంతమంది యువకులు స్వచ్ఛందంగా గ్రంథాలయం పునరుద్ధరణ కోసం విరాళాలు సేకరించి ప్రతి నెల దినపత్రికలతో పాటు విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. దాతల సహకారంతో కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేసి నెలసరి వీటిని నిర్వహించే వ్యక్తికి గౌరవ వేతనం ఇచ్చే వీలును కల్పించారు. ప్రస్తుతం దాతలు ముందుకు రాకపోవడంతో నిర్వహణ భారమై గ్రంథాలయం మూతపడింది. మున్సిపాలిటీగా మారిన తర్వాత గ్రంథాలయానికి పూర్వవైభవం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం గ్రంథాలయానికి కేటాయించిన భవనం తలుపులకు వేసి ఉన్న తాళాలు పగిలిపోవడంతో భవనంలో ఫర్నీచర్‌కు రక్షణ కరువైంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలక వర్గం స్పందించి గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పక్కాగా ప్రత్యేక అవసరాల విద్యార్థుల నమోదు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అధికారి యుగేంధర్

ఖిల్లాఘనపురం: భవిత కేంద్రానికి వచ్చే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల నమోదు పక్కాగా ఉండాలని జిల్లా విలీన విద్య సమన్వయ కర్త యుగేంధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన పలు కార్యక్రమాల రికార్డులను పరిశీలించారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ క్యాంపులకు హాజరైన విద్యార్థుల సంఖ్యకు సంబంధించిన వివరాలు, కేంద్రంలో ఇప్పటి వరకు నమోదు చేసిన విద్యార్థుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఈ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం అన్ని రకాల సౌకర్యాలు కేంద్రంలో కల్పించాలన్నారు. పిల్లల ప్రొఫైల్, ఐఈపీలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ కేంద్రానికి వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత రవాణా ఖర్చులు, ఉచిత ఉపకరణాలు మొదలైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఆర్పీ మల్లీశ్వరి, సీఆర్పీ వెంకటేష్, ఎంఐఎస్ ఆపరేటర్ పవన్‌కుమార్, తిరుపతయ్య, కేర్‌టేకర్ తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నారాయణపేట జి. వెంకటేష్ గౌడ్ - 96666 52077
మక్తల్ మహేష్ - 83099 46853
కోస్గి కె. రమేష్ - 99486 98552

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
జావిద్ : 90109 62007